కథ

# నమ్మకం

జి.నరసింహమూర్తి

**ప్రత్యూషపువేళ! తూరుపు దిక్కు రాగ రంజితవౌతోంది. చల్లటిగాలి హోరున వీస్తోంది.**

**వీధి చావడిలో పడుకున్న పరంధామయ్య ఉలిక్కిపడి లేచాడు; రాత్రంతా ఆలోచిస్తూ పడుకోవడంతో నిద్ర సరిగా పట్టలేదు. కళ్ళు నులుపుకుంటూ పక్క మీంచి లేచి కూర్చున్నాడు. దూరంగా ఆలయంలోంచి సుప్రభాతం వినిపిస్తోంది. కూర్చున్న పరంధామయ్య పక్కింటి చావడిలో ముగ్గు పెడుతున్న అరుణని చూశాడు. ఉలిక్కిపడ్డాడు.**

'అయ్యో! ఎంత పనైపోయింది. లేస్తూనే ఇదేమిటీ శకునం. భర్తపోయిన అరుణను తను చూసేశాడు. ఏం జరుగబోతోందో ఏమిటో!' భయం వేసి మళ్ళీ ముసుగుతన్ని పడుకున్నాడు.

ఈమధ్య అన్నీ చెడు వార్తలే. ఇంకేం జరుగబోతోంది? రాబోయే ఇంకో చెడుకిది సంకేతమా!

అదంతా ఓ లోగిలి. అన్ని ఇళ్ళు కలిసే ఉంటాయి. పరంధామయ్య పక్కిల్లు రాఘవరావుగారిది. ఆయనేమో కలెక్టరాఫీసులో గుమాస్తా. సంవత్సరం క్రితమే మిలటరీలో పనిచేస్తున్న అతని కొడుకు కాశ్మీర్‌లో తీవ్రవాదుల ఎదురుకాల్పుల్లో మరణించాడు. అప్పటికి సంవత్సరం క్రితం పెళ్ళయిన అతని భార్య నిండు గర్భవతి. భర్త చనిపోయిన తరువాత పుట్టెడు దుఃఖంతో అత్తవారింట్లోనే ఉంటోంది. సాధారణంగా ఎవరికీ కనిపించదు. ఈ రోజు తను ఆరుబయట పడుకోవడం వల్ల ఇది జరిగింది. తన కూతురు వయసామెది. ఆమె పుట్టెడు దుఃఖంతో ఉంటే ఈ తప్పుడు ఆలోచన ఏమిటి? తను టీచరై ఉండి ఇటువంటి మూఢ నమ్మకాన్ని నమ్మొచ్చా! ఎంత తప్పు? పరంధామయ్య ఆలోచనలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. అన్యమనస్కంగా పక్క మీంచి లేచాడు.

కాలకృత్యాలు ముగించుకొన్న తరువాత భార్య సుందరమ్మ కాఫీ తెచ్చిచ్చింది. తాగుతూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఎన్ని సమస్యలు..ఈరోజు ఏం జరుగబోతోంది?

★ ★ ★

పరంధామయ్య టీచరుగా మంచి పేరు సంపాదించుకున్నాడు. చిన్న సంసారం, కూతురు, కొడుకు, అణకువ గల భార్య. క్రితం సంవత్సరమే కూతురికి పెళ్ళి చేశాడు. కొడుకు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. కానీ దురదృష్టవశాత్తు ఏజ్ బార్ కావస్తున్నా సరియైన ఉద్యోగం రాలేదు. ఈసారి లాస్ట్ ఎటెంప్ట్‌గా సివిల్ సర్వీసెస్ రాశాడు. రిటెన్‌లో పాసై వైవాకెళ్ళొచ్చాడు. ఈసారిగానీ సెలక్ట్ కాకపోతే ఇంకంతే. మరి ఛాన్స్ లేదు. కూతురు సావిత్రి గురించే బాధంతా. ఈమధ్యనే ఆమె సంసారంలో కలతలొచ్చిపడ్డాయి. అబ్బాయి ఒక మల్టీనేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. మొదట్లో కాపురం సాఫీగానే సాగింది. కానీ ఈమధ్యనే అల్లుడికి అతను పని చేసే ఆఫీసులోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఒక అమ్మాయితో సంబంధం ఏర్పడిందిట. అప్పటినుంచి కలతలు మొదలయ్యాయి. చీటికి మాటికి గొడవలు. ఈమధ్యనే పురుటికొచ్చింది. మగపిల్లవాణ్ణి కన్నది. మళ్ళీ అప్పుడు ఏడుస్తూ చెప్పింది. అతనేమో తనకి విడాకులు ఇచ్చి ఆ అమ్మాయిని పెళ్ళాడుతాట్ట. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. కూతురు కాపురం ఇలా కూలిపోవలసిందేనా? ఆమె పరిస్థితి చూసి పరంధామయ్య మౌనంగా రోదించాడు. అల్లుణ్ణి కలిసి మాట్లాడాడు. అల్లుడు కరాఖండిగా చెప్పాడు. ''మీ అమ్మాయికీ నాకూ ఇక నప్పదండీ. విడాకులు తప్పవు'' అని. దానికి చెప్పిన కారణం అతి చిన్నది. ఆమె తనకు ఏ విషయంలోనూ సహకరించటం లేదని. కానీ తనకు తెలుసు అది కరెక్టు కారణం కాదని. కూతురు మౌనంగా ఏడుస్తుంటే మనసు తరుక్కుపోతోంది.

ఇలా ఉండగా నెల రోజుల క్రితం పిడుగులా వచ్చిందా ఉత్తరం. అది అల్లుడు కూతురికి పంపిన విడాకుల పత్రం.

పులిమీద పుట్రలా ఇంటి గొడవొకటి; తనున్న ఇల్లు తాత ముత్తాతల నాటిది; తను వాళ్ళకి ఒక్కడే కొడుకు కావడం వల్ల తను అనుభవిస్తున్నాడు. కానీ మూడేళ్ళ క్రితం అతని చిన్నాన్న కొడుకు దావా వేశాడు ఆ ఇంట్లో తనకు వాటా వస్తుందని. మూడు సంవత్సరాలైంది కేసు కోర్టులో నలుగుతోంది. ఈరోజు ఫైనల్ హియరింగ్. ఏం జరుగుతుందో..తీర్పు ఎగనెస్ట్‌గా వస్తే ఇక అద్దింట్లో ఉండాలి.


★ ★ ★

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. స్నానాదులు, పూజానంతరం, టిఫిన్ ముగించి స్కూలుకి బయలుదేరాడు. అన్యమనస్కంగా మోపెడ్ స్టార్ట్ చేసి లేటయిందని స్పీడుగా పోనిచ్చాడు.

విపరీతమైన ట్రాఫిక్. తీవ్రమైన ఎండ కూడా తోడు కావడంతో డ్రైవింగ్ మీద కాన్‌సన్‌ట్రేషన్ కష్టమైపోతోంది. దానికితోడు ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలు. ఈలోగా పెద్ద హారన్‌తో సిటీబస్ అతన్ని రాసుకుంటూ వెళ్ళిపోయింది. దాన్ని తప్పించాలని ప్రక్కకు వెళ్ళడంతో ఎదురుగా వస్తున్న ఆటోను చూడలేదు. లక్కీగా ఆటోడ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో ముప్పు తప్పింది. బండి ప్రక్కకి పడిపోవడంతో కాళ్ళకి కొద్దిగా గాయాలయ్యాయి. జనం మూగారు. అందులో కొందరు పరంధామయ్యని పోల్చి హాస్పిటల్‌కు తీసుకెళ్ళి కట్లు కట్టించారు. తరువాత స్కూలుకి చేరుకొనే సరికి ఓ గంట ఆలస్యమైంది. పరంధామయ్య మనసు పరి పరి విధాలుగా ఆలోచిస్తోంది. ఈరోజు ఎంతటి గండం తప్పింది. బహుశా దీనికి కారణం ఆమె ముఖం చూడడమేనా? ఎంత కాదనుకున్నా ఆలోచనలన్నీ అటు వైపే ముసురుకుంటున్నాయి.

సరిగ్గా 12 గంటలయ్యేసరికి కొడుకు రాము రొప్పుతూ స్కూలుకొచ్చాడు. గాబరాగా ఉన్న కొడుకుని చూసి ''ఏమయిందని'' అడిగాడు.

''ఏం లేదు నాన్నా! అక్కయ్య నీరసంతో కళ్ళు తిరిగి పడిపోయింది. డాక్టర్ దగ్గరకు తీసుకె



ళ్ళాను.

ఇంజక్షను చేశాడు''

''ఇప్పుడెలా ఉంది?'' ఆదుర్దాగా అడిగాడు.

''ఇప్పుడు బాగానే ఉంది నాన్నా! ఈ మందులు కొనమన్నారు డ్మాక్టర్'' అని చీటీ ఒక టిచాడు. అది చదివి జేబులోంచి డబ్బు తీసిచ్చి అన్నాడు ''ఇవి కొనుక్కుని ఇంటికి వెళ్ళు! అక్కని రెస్ట్ తీసుకొమ్మని చెప్పు. నేను స్కూలవగానే వస్తాను'' అని చెప్పాడు.

కొడుకు వెళ్ళగానే పరంధామయ్య కాళ్ళలో వణుకు మొదలైంది. ఒక్కటొక్కటీ జరుగుతున్న సంఘటనలను చూసి అతను బెదిరిపోయాడు. ఇంకేం జరుగబోతోందో! స్కూలులో పాఠం చెబుతున్నాడే గానీ ఆలోచనలన్నీ ఉదయం జరిగిన సంఘటన మీదే.

ఆలోచనలలోంచి బయటపడ్డాడు. ఏం జరుగబోతోంది ఈ రోజు. రోజంతా అవే ఆలోచనలు, భయం గొలిపే ఆలోచనలు..అనుక్షణం దేవుడికి మొక్కుతూనే ఉన్నాడు ఈరోజు ఏం జరుగకూడదనే.

మధ్యాహ్నం స్కూల్లో భోజనం చేస్తుండగా పోస్ట్‌మాన్ రిజిస్టర్ కవరు తెచ్చి ఇచ్చాడు. పరంధామయ్య సంతకాలు చేసి అందుకున్నాడు. దాని ఎడ్రస్ చూడగానే విప్పి చదవడానికి అతనికి ధైర్యం చాల్లేదు. అది అల్లుడి దగ్గర్నుంచి. బహుశా విడాకులకి తాము సమాధానం ఇవ్వలేనందుకు కోర్టు విడాకులు మంజూరు చేసిన ఉత్తర్వులేమో. అది చదివే ధైర్యం తనకు లేదు. అందుకే ఆ కవర్ తెరవలేదు.

కోర్టులో ఈపాటికి జడ్జిమెంట్ పూర్తయిపోయి ఉంటుంది. లాయర్ నుంచి ఇంకా ఫోన్ రాలేదు. అంటే బహుశా కేసు ఓడిపోయాడేమో. భగవాన్... నీదే భారం. ఇంట్లోకి ప్రవేశించేసరికి వాతావరణం గంభీరంగా ఉంది. కొద్దిసేపటికి కూతురు వచ్చి కాఫీ ఇచ్చింది. త్రాగిన తర్వాత వణుకుతూ కవరు విప్పాడు. అది అల్లుడు రాసిన ఉత్తరం.

''ప్రియమైన మామగారికి,

మీ అల్లుడు నమస్కరించి వ్రాయునది. తెలుసో తెలియకో నేను ఆమె వ్యామోహంలో పడ్డాను. నిజం చెప్పాలంటే నేను డబ్బు మీద ఆశతోనే ఆమెకు దగ్గరయ్యాను. ఆమె మంచి పొజిషన్‌లో ఉంది. అందుకనే ఆమెను పెళ్ళాడితే మాకున్న ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి అనుకున్నాను. దానికి మా కుటుంబ సభ్యుల మద్దతు కూడా లభించింది. అంతే ఆ క్షణం నుంచీ మీ అమ్మాయిని ఎన్ని బాధలు పెట్టామో నాకే తెలియదు. దేవతలాంటి ఆమెను నేనెంతో బాధ పెట్టాను. సీత, సావిత్రిలా ఆమె అవన్నీ ఓర్చింది.

అసలు విషయానికొస్తే మా విడాకుల సంగతి మా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కి తెలిసింది. నన్ను తన ఇంటికి రమ్మన్నాడు. ఆ మర్నాడు వెళ్ళాను. ఆయన తన స్కూలు గ్రూప్ ఫోటో చూపించాడు. అందులో వాళ్ళ హెడ్‌మాస్టర్ మీరే. అప్పుడు చెప్పడం మొదలుపెట్టాడు. మీ వ్యక్తిత్వం గురించి, గొప్పదనం గురించి. అటువంటి తన గురువు కూతురికి అన్యాయం చేస్తే ఊరుకోనన్నాడు.



మా ఇద్దరినీ ఉద్యోగాల్లోంచి తొలగిస్తానన్నాడు. మీవంటి మామగారు దొరకడం, అతని కూతురు భార్యగా రావడం ఎంతో అదృష్టమని చెప్పి నేను చేసింది ఎంత పెద్ద తప్పో వివరించి చెప్పాడు. నేను చేసింది ఎంత పొరపాటో నాకు అర్థమైంది. మీరు నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి. నేను


ఎల్లుండి వస్తున్నాను. బారసాలకి ముహూర్తం పెట్టండి. సావిత్రిని- నన్ను క్షమించమని చెప్పండి. జీవితంలో ఇటువంటి తప్పులు ఇంకె ప్పుడూ చెయ్యను.

మీ అల్లుడు,

రంగారావు''

అంతా నిశ్శబ్దం. సూది పడితే వినిపించేటం తటి నిశ్శబ్దం. సుదీర్ఘమైన ఉత్తరం చదివిన తరు వాత పరంధామయ్య మనసు గాలిలో తేలిపోసా గింది. ఎంతటి శుభవార్త-అంతే ఉద్వేగంతో ''అమ్మా!'' అని అరిచాడు. కూతురు పరుగెత్తు కొచ్చింది. ఆమెకి ఆ ఉత్తరం ఇచ్చాడు. ఆమె చదువుతూ ఇంట్లోకి పరుగెత్తింది. ఇంక ఇంట్లో సందడే సందడి.

పరంధామయ్య ఆలోచిస్తున్నాడు. నేను తల చిందేమిటి? జరిగిందేమిటి? ఎంత తప్పుగా ఊహించాను.



అరగంట తర్వాత ఫోను మ్రోగింది. రామం వెళ్ళి మాట్లాడ సాగాడు. అతను ''థాంక్యూ థాంక్యూ'' అనడం వినిపిస్తోంది. రెండు నిముషాల తర్వాత ఫోను పెట్టి ''నాన్నగారు! నేను సివిల్ సర్వీ సెస్‌లో సెలక్ట్ అయ్యాను. మా ఫ్రెండ్ రాజు చెప్పాడు. ఇప్పుడు నేను ఇంటర్నెట్‌కెళ్ళి చూసుకుం టాను'' అంటూ ఉద్వేగంతో బయటకెళ్ళిపోయాడు.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిన పరంధామయ్యకు పక్కింటి రాఘవరావుగారి కోడలు అరుణ, ఆమె దీనమైన ముఖం కని పిస్తోంది. తన అనుమానాలు తనను వెక్కిరిస్తున్నట్లుగా ఫీలయ్యాడు పరంధామయ్య.

ఇంతలో ఫోన్ మ్రోగింది. అది తమ లాయరుది. ''హలో పరంధా మయ్యగారూ! నేనండీ రామయ్య పంతులుని. మనం కేసు గెలిచాం. మీరింక నిశ్చింతగా ఉండండి''

''థాంక్యూ సార్! థాంక్యూ! మీకెలా కృతజ్ఞతలు తెలపాలో నాకు అర్థం కావడం లేదు సార్''

''ఇందులో కృతజ్ఞత ఏముంది సార్. ఆస్తి మీది. అన్యాయంగా సంపాదించింది కాదు. న్యాయంగెలి చింది. వీలయితే రేపొకసారి రండి. ఆ కాగితాలు అవీ తీసుకెళ్లరు గాని'' అన్నాడు లాయరు.

''అలాగే సార్'' అని ఆనందంతో తబ్బిబ్బై భార్యను, పిల్లల్ని పిలిచి చెప్పాడు.

ఈలోగా పరంధామయ్య స్కూల్లోనే పనిచే స్తున్న టీచర్లందరూ ఇంటికి వచ్చారు. ఎందుకొ చ్చారో..? బహుశా పిల్లాడు ఇంటర్వ్యూలో సెలక్ట్ అయినందుకు కంగ్రాట్స్ చెబుదామని వచ్చారా? ఆలోచిస్తుండగానే అభినందనల వెల్లువ మొదలైంది. సైన్స్ టీచర్ స్వీట్స్ తీసి నోట్లో పెట్టాడు. ''సార్! మీకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ టీచర్ అవార్డు వచ్చింది''

ఇంకో గంట దాకా తెలిసిన వారందరూ వస్తూనే ఉన్నారు. అభినందనలు చెబుతూనే ఉన్నారు.

రెండు గంటల తరువాత భోజనాల అనంతరం పరంధామయ్య ఆరు బయట వెన్నెలలో మంచం మీద కూర్చుని సుదీర్ఘంగా ఆలోచిస్తు న్నాడు. కొబ్బరాకుల సందు ల్లోంచి వెన్నెల కిరణాలు పడుతు న్నాయి. చల్లనిగాలి వీస్తోంది.

తను ఎంత తప్పుగా ఆలోచిం చాడు. వెంటనే భార్యను పిలిచి తన సంఘర్షణ వివరించాడు.

★ ★ ★

వారం రోజుల తర్వాత ఓ రోజు...

ఆరోజు పరంధామయ్య ఇంట్లో బారసాల. అల్లుడి తరపు వారందరూ వచ్చారు. నామకర ణోత్సవం జరిగింది. ఆనం దంగా ఆ కార్యక్రమం జరుగు తోంది. పరంధామయ్య వాకి ట్లోంచి చూస్తున్నాడు. కూతురు పక్కింటి అరుణకు చీర, తాంబూలం ఇస్తోంది. ఆమె అందుకుంటూ పిల్లాణ్ణి ముద్దుపెట్టుకుంది. నవ్వుతూ ఏదో చెబుతోంది. కూతురు, భార్య, అందరూ సంతోషంగా నవ్వుతున్నారు. ఆ దృశ్యం చూసిన పరంధామయ్య మనసు నెమ్మదించింది.

## మల్లికా సౌరభం

**'ది మిత్' చిత్రంలో నటించిన మల్లికా షెరావత్ ఇప్పుడు చాలా బిజీగా ఉంది. ఆ చిత్రం ప్రీమియర్ కోసం టొరాంటో వెళ్లిన మల్లికా ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన తనకి ఎంతో ఆనందాన్ని ఇచ్చిందంటోంది. అందాన్ని ఆరబోసే ఆమె దుస్తులు ఆ ప్రీమి యర్ షోలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచా యట. నవంబర్‌లో ఇండియాకి రానున్న జాకీచాన్ పర్యటన గురించి ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ పర్యటన ఆమెకి మరిన్ని అవకాశాలకి నాంది కాగలదని భావి స్తున్నారు.**